క్లుప్తంగా

గాయత్రీదేవిగా దుర్గమ్మ



దిమిలి నగ్నేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి హారతినిస్తున్న అర్చకుడు మారుతీశర్మ

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం దుర్గమ్మ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. భవానీ మాలధారణ చేసిన భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ పూజల్లో పాల్గొంటున్నారు. పలు గ్రామాల్లో అమ్మవారి సన్నిధిలో భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

తూర్పుకాపు సంఘం కమిటీ ఏర్పాటు



లాలంకోడూరులో సమావేశమైన తూర్పుకాపు సంఘం సభ్యులు

రాంబిల్లి : లాలంకోడూరులో తూర్పు కాపు సంఘం గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. తూర్పు కాపు సంఘం నాయకులు కరణం శ్రీహరి, ఉప్పులూరి నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అధ్యక్షులుగా అద్దంకుల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిమి శ్రీను, ఉపాధ్యక్షులుగా సమ్మెట్ల గోవింద ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తూర్పు కాపుల సంక్షేమానికి కృషి చేస్తామని కార్యవర్గం పేర్కొంది.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

కోటవురట్ల: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆ సంఘ సభ్యులు సోమవారం ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.అప్పలరాజు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా ఎ.సత్యనారాయణ, అధ్యక్షుడిగా జవ్వాది నర్సింగరావు, కార్యదర్శిగా జె.వి.ప్రసాదరావు, సహ అధ్యక్షులుగా ఎ.ఎన్.వి.లోవరాజు, క్రాంతి, కోశాధికారిగా సంతోష్, కార్యదర్శులుగా ఎం.చిట్టియ్య, జి.ఈశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోటవురట్ల : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

తుమ్మపాల: ప్రజలకు చేతనైనంత సాయం చేయడమే దైవ సేవ అని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పాస్టర్స్ డే పురస్కరించుకుని పట్టణంలోని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బిషప్ క్రాంతిపాల్ ఆర్థిక సాయంతో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిషప్ క్రాంతిపాల్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని అందరు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాస్టర్స్ సేవలను గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. బిషప్ క్రాంతిపాల్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాలనే కుట్టు మిషన్లు అందించామన్నారు. కార్యక్రమంలో ధర్మదాస్, పాల్‌బాబు, కేపీడీఆర్ ప్రసాద్, రెవ సీహెచ్ ప్రకాష్, బి.యేసురత్నం పాల్గొన్నారు. అంతకు ముందు రత్నాకర్ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ప్రయాణికుల వసతులు, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరాను పరిశీలించి, మెరుగుపరచాల్సిందిగా సూచించారు.

సౌకర్యాలు టాప్ క్లాస్

పెచ్చులూడుతున్న శ్లాబు. పెద్ద గాలొస్తే ఊడిపోయే కిటికీలు. ఎక్కడికక్కడ తెగి, వేలాడుతున్న విద్యుత్ వైర్లు. నెర్రెలు వారి, మొక్కలు మొలిచి శిథిలావస్థకు చేరిన గోడలు. అందుబాటులో లేని రక్షిత తాగునీరు. చూసేందుకే భయపడే టాయిలెట్లు. ప్రాంగణమంతా తుప్పలు, పొదలు.. పాముల భయంలో విద్యార్థులు. ఇదీ ఒకప్పటి యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల దుస్థితి. ప్రస్తుతం సీఎం జగన్ పాలనలో నాడు–నేడు నిధులు రూ.కోటీ 4 లక్షలతో కళాశాల రూపురేఖలే మారిపోతున్నాయి.



యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్



వరండాలకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్



తరగతి గదిలో విద్యార్థులు కూర్చునేందుకు ఆధునిక ఫర్నిచర్



యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సమకూరుతున్న వసతులు
- రూ.1.04 కోట్ల నాడు నేడు నిధులతో కళాశాల ఆధునికీకరణ
- శరవేగంగా పనులు.. ఆనందంలో విద్యార్థులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి, సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాలుగున్నరేళ్లలోనే నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో సకల సదుపాయాలూ కల్పించారు. ప్రభుత్వ కళాశాలలంటే ఒకనాడు చిన్నచూపు. కానీ సీఎం జగన్ సంకల్పంతో ప్రభుత్వ కళాశాలల్లో టాప్ క్లాస్ సౌకర్యాలు సాధ్యమయ్యాయి. అలాంటి కళాశాలల జాబితాలోకే యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల చేరింది. ఈ కళాశాలకు నాడు–నేడు రెండో విడతలో రూ.1.04 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

రూ.1.04 కోట్లతో ఆధునికీకరణ

నాడు–నేడు రెండో విడతలో ఈ కళాశాలకు రూ.1.04 కోట్లు మంజూరయ్యాయి. రూ.19.52 లక్షలతో బాల, బాలికలకు వేర్వేరుగా రన్నింగ్ వాటర్ సదుపాయంతో టాయిలెట్లు నిర్మించారు. రూ.5.46 లక్షలతో రక్షిత తాగునీటి వసతి కల్పించారు. విద్యార్థులు, సిబ్బందికి అనువైన ఆధునిక ఫర్నిచర్‌కు రూ.29.54 లక్షలు వెచ్చించారు. రూ.2.11 లక్షలతో గ్రీన్ బోర్డులు, రూ.30.27 లక్షలతో చిన్న పెద్ద మరమ్మతులు, రూ.3.41 లక్షలతో విద్యుదీకరణ, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. కళాశాలను పెయింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దేందుకు రూ.14.29 లక్షల నిధుల్ని ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే రూ.66,26,130లను ఖర్చు చేసి ఫర్నిచర్ కొనుగోలు చేశారు. వీటిని ఇప్పటికే కళాశాలలోని తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. కళాశాల నాడు–నేడు బ్యాంకు ఖాతాలో రూ.28,70,525 జమ అయింది. ఆ మేరకు వివిధ పనులు చేపట్టారు. కళాశాలలోని నాలుగు బ్యాకుల్లోని మూడు అంతస్థులకూ వరండాల్లో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 512 మంది, ద్వితీయ సంవత్సరంలో 385 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ రక్షిత తాగునీరు సరఫరా అయ్యేలా రెండు చోట్ల ఆర్వో ప్లాంట్లను సిద్ధంచేశారు. ఇక ఆధునిక వసతులతో టాయిలెట్లు, విద్యుత్ సంబంధిత పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఇలాంటి సౌకర్యాలు ఊహించలేదు



ప్రభుత్వ కళాశాలలో ఇలాంటి సౌకర్యాలు ఉంటాయని ఊహించలేదు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాలతో విద్యార్థులంతా ఎలాంటి ఇబ్బంది లేకుండా చదువుకుంటున్నాం. ముఖ్యంగా తరగతి గదుల్లో కూర్చునేందుకు వేసిన బెంచీలు చాలా సౌకర్యవంతంగా ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చదువుకునేలా ఆహ్లాదకర వాతావరణం ఉంది.

– కె.శ్రీజ, ఇంటర్ ఫస్టియర్

అందుబాటులో రక్షిత తాగునీరు



గతంలో తాగునీటికి విద్యార్థులంతా ఇబ్బంది పడేవాళ్లం. ఇపుడు రక్షిత తాగునీరు అందించేందుకు కళాశాల ఆవరణలో రెండు ఆర్వో ప్లాంట్లు పెట్టారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులంతా ఆ నీటిని తాగుతున్నాం. ఇక తరగతి గదుల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యాన్లు, లైట్లతో కార్పొరేట్ కాలేజీలో ఉన్నట్లుగా ఉంది. క్లాసులు కూడా చాలా బాగా చెప్తున్నారు.

– కె.హేమలత, ఇంటర్ విద్యార్థిని

పారదర్శకంగా పనులు



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా గడువులోగా పనులు పూర్తి చేస్తాం. పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాం. ప్రతి పైసా కళాశాల అభివృద్ధికి వెచ్చించేలా స్థానికులు, లెక్చరర్లతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చెసింది. వారందరి భాగస్వామ్యంతో చకచకా పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పనులన్నీ పూర్తి చేసి కళాశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతాం.

– బి.భాగ్యవతి, ప్రిన్సిపాల్

సీఎంకు సాదర స్వాగతం











యుజియా స్టెరైల్ పరిశ్రమ, లారస్ ల్యాబ్‌లో రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి హెలిపాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావు, యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం

సురక్షతో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం



బంగారమ్మపాలెంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందాలని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యులు శక్తిప్రియ, వాసంతి అన్నారు. వాకపాడు సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 317 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 15 మందిని ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిమిత్తం పట్టణ ఆస్పత్రికి తరలిస్తున్నట్టు చెప్పారు. అలాగే ఇంటివద్ద కదలలేని రోగుల వద్దకు కూడా వైద్యాధికారి వెళ్లి పరీక్షలు నిర్వహించారు. బంగారమ్మపాలెం, వాకపాడు, కాపులవాతాడ తదితర గ్రామాలకి చెందిన వారు శిబిరంలో వైద్య సేవలు వినియోగించుకున్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.

418 మందికి ఉచిత వైద్య పరీక్షలు



ఈదటంలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు



ఈదటం శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట : మండలంలో గల ఈదటం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 418 మంది ప్రజలు ఆరోగ్య పరీక్షలకు హాజరయ్యారు. బీపీ, సుగర్, రక్త పరీక్షలు, టైఫాయిడ్, మలేరియా, మూత్ర పరీక్షలు నిర్వహించారు. గుండెకు సంబంధించిన సమస్యలు వున్న రోగులకు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో డాక్టర్ వంశీకృష్ణ ఎముకల సమస్యలకు, డాక్టర్ అక్షయ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ పద్మప్రియ, డాక్టర్ తులసీ నవీన సాధారణ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ చంద్రశేఖర్, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీహెచ్‌వో ఆర్.జె.బాలాజీసింగ్, వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట



బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



చెర్లోపాలెంలో వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన కార్యక్రమంగా గుర్తింపు పొందిందన్నారు. మండలంలోని చెర్లోపాలెంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ అప్పికొండ సత్యవతి, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి శ్రీనివాసరావు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు జగన్, మడకపాలెం, మెలిపాక సర్పంచ్‌లు వెంకటరావు, విజయ భాస్కరరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా..



రాజుపేట వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది, అధికారులు

కోటవురట్ల : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. రాజుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్యాధికారి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు పర్యవేక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వైద్య శిబిరాలకు మంచి స్పందన వస్తోందన్నారు. ఈ శిబిరంలో 385 మంది రోగులను పరీక్షించినట్టు తెలిపారు. ఇందులో 94 మందికి కంటి వైద్య పరీక్షలు చేసినట్టు తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు 161 మందిని పరీక్షించి 9 మందికి సర్జరీలు అవసరమున్నట్టు గుర్తించారని తెలిపారు. ఇప్పటి వరకు 9 శిబిరాలు నిర్వహించగా 3027 మంది ఓపీ వచ్చినట్టు తెలిపారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీలు



ఈదటంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సత్యవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలో పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. బాల్య వివాహాలు నివారించాలని ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈదటం, సత్యవరం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, మహిళ పోలీసులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ఈఓఆర్‌డీ చంద్రశేఖర్, సత్యవరం సర్పంచ్ రాము పాల్గొన్నారు.

మునగపాకలో ర్యాలీ

మునగపాక : బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. ఈ మేరకు మునగపాకలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేయడం ద్వారా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి : బాల్యవివాహాలను అరికట్టాలంటూ సోమవారం సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వేంపాడు, దేవవరం, ఉద్దండపురం తదితర గ్రామాల్లో క్యాండిల్ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచ్‌లు రాఘవ కుమారి, ఏడిద నూకరత్నం, ఎంపీటీసీ కుంచా మధు సీడ్ ప్రతినిధులు సత్యార్థి, అమ్మాజీ తదితరులు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు. చట్టప్రకారం వివాహ వయసు వచ్చే వరకు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలను చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, వలంటీర్లు పాల్గొన్నారు.



దేవవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



వేంపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

అరబుపాలెంలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

మునగపాక : మండలంలోని అరబుపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కట్టుబోలులో...

రాంబిల్లి: కట్టుబోలు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు సందర్శించనున్నట్టు ఎంపీడీవో కె. ఎస్. కొండలరావు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

యలమంచిలి : పట్టణంలో సోమలింగపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

యలమంచిలి : ప్రతి పిటిషన్‌కు 20 చొప్పున సంక్షేమ నిధికి చెల్లించాలని రాష్ట్ర బార్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం యలమంచిలిలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. స్థానిక న్యాయస్థానాలు ప్రాంగణం వద్ద ఇక్కడ న్యాయవాదులు అంతా కలసి విధులు బహిష్కరించి రాష్ట్ర బార్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ నెల 16 నుంచి 18 వ తేదీ వరకు విధులు బహిష్కరిస్తున్నట్టు యలమంచిలి బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పట్నాయక్, సెక్రటరీ కూనిశెట్టి శ్రీనివాస్, ధూళి నూకరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు



కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

కోటవురట్ల : బాల్య వివాహాల రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సీడ్ ఆర్గనైజేషన్ పిలుపునిచ్చింది. మండలంలోని పలు గ్రామాల్లో సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే పరిణామాలు, నష్టాన్ని వివరిస్తూ సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ర్యాలీ చేసి బాల్య వివాహాలు వద్దంటూ నినాదాలు చేశారు. సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి మహాలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించేందుకు సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీడ్ సభ్యురాలు లక్ష్మీదేవి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చినదొడ్డిగల్లులో 600 మందికి వైద్య పరీక్షలు



చినదొడ్డిగల్లు వైద్య శిబిరంలో సేవలందించిన వైద్య సిబ్బంది

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన సుమారు 600 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గొడిచర్ల పీహెచ్‌సీకి చెందిన వైద్యాధికారులు డాక్టర్ మురళీకృష్ణారెడ్డి, సుకన్య తదితరులు రోగులకు ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి వ్యాధులతో బాధపడేవారిని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని విశాఖలోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కీళ్ల నొప్పులు, జ్వరం నీరసం వంటి సమస్యలతో బాధపడేవారు ఎక్కువగా ఈ శిబిరానికి వచ్చారు. వలంటీర్లు సచివాలయ సిబ్బంది వీరందరికీ దగ్గరుండి వైద్యపరీక్షలు చేయించి పంపించారు. ఈ శిబిరంలో డాక్టర్లతో పాటు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది, పంచాయతీరాజ్, రెవెన్యూ సిబ్బంది సేవలందించారు. ఎటువంటి అసౌర్యం కలగకుండా ఎంపీడీవో శ్రీనివాసరావు కార్యదర్శి రాజశేఖర్ పర్యవేక్షించారు.

దిబ్బపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని దిబ్బపాలెం సచివాలయం – 1 పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారని తెలిపారు. నిరుపేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యం ఇబ్బంది అవుతుండడంతో గ్రామ గ్రామాన ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, పీహెచ్‌సీ సిబ్బంది, విజయ్, దేముడు, శ్రీను పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

తుమ్మపాల: ప్రజలకు చేతనైనంత సాయం చేయడమే దైవ సేవ అని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పాస్టర్స్ డే పురస్కరించుకుని పట్టణంలోని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బిషప్ క్రాంతిపాల్ ఆర్థిక సాయంతో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిషప్ క్రాంతిపాల్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని అందరు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాస్టర్స్ సేవలను గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. బిషప్ క్రాంతిపాల్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాలనే కుట్టు మిషన్లు అందించామన్నారు. కార్యక్రమంలో ధర్మదాస్, పాల్‌బాబు, కేపీడీఆర్ ప్రసాద్, రెవ సీహెచ్ ప్రకాష్, బి.యేసురత్నం పాల్గొన్నారు. అంతకు ముందు రత్నాకర్ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ప్రయాణికుల వసతులు, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరాను పరిశీలించి, మెరుగుపరచాల్సిందిగా సూచించారు.